1. మాతృవేదన

1. ప్రతిపదార్థం రాయండి.

ఇది ప్రళయాగ్ని వోలె దెసలెల్లను గప్పగ c విస్ఫులింగముల్
వదలక వాయు సారథి జవంబున c దానిట వచ్చె నేమిసే
యుదు సుతులార యీ బిలము నొయ్యన పోయి చొరుండ దీనిగ్ర
హ్పెద ఘనపాంసు జాలముల భీమ శిఖావళి దాఁకకుండగన్.

పరిచయం: పైపద్యం నన్నయ రచించిన మహాభారతంలోని ఆదిపర్వ అష్టమాశ్వాసం నుంచి గ్రహించిన మాతృవేదన అనేపాఠ్యభాగం లోనిది.

సందర్భం: అగ్ని జ్వాలల్ని చూసి పిల్లల్ని కాపాడడానికి వారిని రంధ్రంలోకి ప్రవేశించమని కోరుతూ జరిత పలికిన సందర్భం

ప్రతిపదార్థం: సుతులార–ఓ కుమారులార

ఇది–ఈ అగ్ని
ప్రళయ+అగ్ని+పోలె–ప్రళయ కాలములో చెలరేగే అగ్నిలా
దెసలు+ఎల్లను–అన్నివైపులా
కప్పగన్–వ్యాపించగా
విస్ఫులింగముల్–అగ్నికణాలు
వదలక–విడువక
వాయుసారధి–వాయువు సారధిగా కలిగిన అగ్ని
జవంబునన్–మితిమీరిన వేగంతో
తాన్–తాను
ఇట వచ్చెన్–ఇటుగా వస్తున్నది
ఏమి+చేయుదు–ఏమిచేయను
బయ్యన–వెంటనే
పోయి–వెళ్లి
చొరుండు–దాక్కోండి
దీనిన్–ఈ రంధ్రాన్ని
ఘనపాంసుజాలములు–దట్టమయిన ధూళి సమూహంతో
భీమశిఖా+ఆవళి–భయంకరమైన అగ్నిజ్వాలలు
తాకకుండగన్–అంటు కోకుండా

కొప్పెదన్-మూస్తాను.

భావం: కుమారులారా! మంటలు ప్రళయాగ్నిలా అన్నివైపులా కమ్ముకొస్తున్నాయి. అగ్ని ఇటువైపు వస్తోంది. ఏమి చేయాలో దిక్కు తోచడంలేదు. మీరు రంధ్రంలోకి వెళ్లి దాక్కోండి. రంధ్రాన్ని ధూళి రేణువుల సహాయంతో కప్పి మిమ్మల్ని కాపాడుకొంటాను అని జరిత కుమారులతో అంది.

2. కొడుకుల బ్రహ్మవిత్తముల గోరిన యట్టుల వీరి నల్వురం
బడసితి నిమ్మహాత్ముల నపాయము నొందక యుండ బెంచుచున్
నడపుమటంచు నన్ను మునినాథుడు ఁ మీ జనకుండు పంచియి
ప్పుడ యెటయేని ఁబోయె హుతభుక్ప్రళయంబు దలంప కక్కటా

పరిచయం: పైపద్యం నన్నయ రచించిన మహాభారతంలోని ఆదిపర్వ అష్టమాశ్వాసం నుంచి గ్రహించిన మాతృవేదన అనేపాఠ్యభాగం లోనిది.

సందర్భం: కోరుకున్న విధంగా బ్రహ్మజ్ఞానం గల్గిన కుమారులను పొందానని జరిత పలికిన పలుకులు.

ప్రతిపదార్థం:

కోరిన+అట్టుల-నేను కోరుకున్న విధముగా
బ్రహ్మవిత్తములన్-బ్రహ్మజ్ఞానం కలిగిన వారైన
వీరినల్వురన్-ఈ నలుగురు
కొడుకులన్-కుమారులను
పడసితిన్-పొందాను
ఈ +మహత్ములన్- ఈ మహనీయులకు
అపాయమున్-ఏ ఆపద
ఒందక+ఉండన్-రాకుండా
పెంచుచున్-కాపాడుతూ
నడుపుము-పోషింపుము
అటంచున్-అనుచు
నన్నున్-నన్ను
ముని నాథుడు-మునుల్లో శ్రేష్ఠుడు
మీ జనకుండు-మీతండ్రి
పంచి-ఆజ్ఞాపించి
హుతభుక్ ప్రళయంబు-అగ్ని వల్ల కలిగే అపాయము
తలంపక-ఊహింపక
అక్కట-అయ్యో

ఇప్పుడ–ఇప్పుడే

ఎటయేనిన్–ఎక్కడికో

పోయె–వెళ్ళెను

భావం : నేను కోరుకన్న విధంగా బ్రహ్మజ్ఞాన సంపన్నులైన ఈ నలుగురిని పొందాను. ఈ మహత్ములకు ఏ ఆపద రాకుండా పెంచి పోషించమని మీ తండ్రి ఆజ్ఞాపించి ఈ అగ్ని ప్రళయం గురించి ఊహించక ఇప్పుడే ఎక్కడికో వెళ్లాడు అని కుమారులతో చెప్పి జరిత దుఃఖించింది.

II **పద్యభావం రాయండి**

పద్యము బిలము సొచ్చితమేని నందెలుక చంపు
నిందయుండి తమేని ఁ దానేర్చు నగ్ని
యెలక చే జచ్చు కంటే నీ జ్వలన శిఖల
గ్రాగి పుణ్య లోకంబులు గాంతుమేము.

భావం : అమ్మా రంధ్రం లోకి వెళ్తే అక్కడ ఎలుక చంపుతుంది. ఇక్కడే ఉంటే అగ్ని దహిస్తాడు. ఎలుక వల్ల చావడం కంటే ఈ మంటల్లో కాలి పుణ్య లోకాలను పొందుతాము'' అని జరితారి తన తల్లితో అన్నాడు.

III **సందర్భాలు రాయండి**

1) **విధి కృతము గడవ నేరఁగ లావే.**

పరిచయం: పైవాక్యం నన్నయ రచించిన మహభారతంలోని ఆదిపర్వ అష్టమాశ్వాసం నుంచి గ్రహించిన మాతృవేదన అనేపాఠ్యభాగం లోనిది.

సందర్భం: అగ్ని ఖాండవ వనాన్ని దహిస్తున్నాడు. మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. జరిత ఇంకా రెక్కలురాని తన పిల్లల్ని చూసింది. అవిఎటూ పోలేని స్థితిలో ఉన్నాయి. మాతృప్రేమతో జరిత వాపోతున్న సందర్భము.

భావం: వీరిని ఎక్కిడికి తీసుకు వెళ్ళలేను. వీళ్లతండ్రిలాగా నిర్భయంగా వదలిపెట్టి వెళ్లలేను. దైవ నిర్ణయాన్ని తప్పించడం ఎవరికీ సాధ్యం కాదుగదా!

2) **ప్రాణభయంబున గగనంబున కెగసి చనెను.**

పరిచయం: పై వాక్యం నన్నయ రచించిన మహభారతంలోని ఆదిపర్వ అష్టమాశ్వాసం నుంచి గ్రహించిన మాతృవేదన అనేపాఠ్యభాగం లోనిది.

సందర్భం: అగ్ని ఖాండవ వనాన్ని దహిస్తున్నాడు. జరిత తన పిల్లల్తో ఇక్కడ నివశిస్తోంది. భయంకరమైన అగ్ని జ్వాలల్ని చూసి రెక్కలైనా రాని తన పిల్లల్ని చూసి దుఃఖిస్తూ పిల్లలున్న రంధ్రంలోకి దూరి ధూళి రేణువులతో రంద్రాన్ని కప్పి మిమ్మల్ని కాపాడుకొంటాను అని పలికింది. అగ్ని భయం

సందేహం కాబట్టి బిలంలో దూరడంకన్నా ఇక్కడే ఉండడం మంచిది. నీవు మాపై మోహాన్ని వదిలి వెళ్లిపో అని కుమారులు కోరగా జరిత ఆకాశానికి ఎగిరిన సందర్భంలోనిది.

భావం: కుమారుల కోరిక మేరకు ప్రాణభయంతో జరిత తన పిల్లల్ని విడిచిపెట్టి శోకతప్త హృదయంతో ఆకాశంలోకి ఎగిరిపోయింది.

IV

1) జరిత మాతృ వేదనని వర్ణించండి?

మాతృవేదన పాఠ్యభాగం నన్నయ రచించిన మహాభారతం నుంచి గ్రహించినది. మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. రెక్కలైనా రాని తన పిల్లల్ని చూచి వీటిని తీసుకొని పోయే శక్తి తనకు లేదని. వీరి తండ్రిలాగా నిర్భయంగా వదలిపోలేను. దైవ నిర్ణయాన్ని తప్పించగలమా? అని జరిత చింతించింది.

ఈ మంటలు ప్రళయాగ్నిలా వేగంగా వ్యాపిస్తున్నాయి. బిలంలో ప్రవేశించండి. మంటలు తాకకుండా దూళిరేణువులతో కప్పుతాను. కోరిన విధంగా బ్రహ్మజ్ఞానులైన నలుగురు కొడుకుల్ని కన్నాను. వీరికి ఏ ఆపద రాకుండా కాపాడు అని మీతండ్రి ఆజ్ఞాపించాడు. అగ్ని ప్రళయం ఊహించక ఇప్పుడే ఎక్కడికో వెళ్లాడు అని జరిత దుఃఖించింది. ఇక్కడే ఉంటే మంటలు వ్యాపిస్తాయి. కాబట్టి మీరు బిలంలో దూరండి. ధూళి రేణువులతో బిలాన్ని మూసి మిమ్మల్ని రక్షించుకుంటాను అని కుమారుల్ని ఉద్దేశించి జరిత అంది. అప్పుడు జరిత పెద్ద కొడుకైన జరితారి ఈవిధంగా అన్నాడు.

'' అమ్మా ! బిలంలో దూరితే ఎలుక చంపుతుంది. ఇక్కడ ఉంటే అగ్ని దహిస్తాడు ఎలుక చేత చావడం కంటే మంటలలో కాలి పుణ్యలోకాలు పొందుతాము. బిలంలో ఎలుక చేత చావడం తథ్యం.'' ఇక్కడ గాలి వల్ల మంటలు తొలగిపోవచ్చు. ఆపద సంభవించినపుడు జరుగుతుందో జరగదో అన్న పనేచేయాలి. నువ్వు మాపై మోహాన్ని వదలి ప్రాణాలు రక్షించుకోమని నలుగురు కుమారులు వేడుకోగా కన్నీరు కారుస్తూ జరిత ఆకాశంలోకి ఎగిరిపోయింది.

పక్షి పిల్లలు నలుగురూ నాలుగు వేదాల మంత్రాలతో అగ్నిని స్తుతిస్తూ శరణు వేడారు. అగ్ని మందపాలుని ప్రార్థనను గుర్తుకు తెచ్చుకొని వారు ఉన్న చెట్టును కాల్చకుండా వదిలి పెట్టాడు . జరిత సంతోషంతో కుమారుల వద్దకు వచ్చి సుఖంగా జీవించింది.

VI

1) పాఠ్యకర్త

కవి-నన్నయ

కాలం-11వశతాబ్దం

బిరుదులు-ఆదికవి, శబ్దశాసనుడు

పాఠ్యభాగ స్వీకారం-ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం అష్టమాశ్వాసం

2) నేపథ్యం: మందపాలుడనే మునిపత్ని జరిత. జరిత లావుక పక్షి. వీరికి నలుగురు కుమారులు. వీరి

నివాసం ఖాండవవనం. ఈవనాన్ని కృష్ణార్జునుల సహాయంతో అగ్ని దహిస్తున్నాడు. కుమారుల్ని కాపాడమని మందపాలుడు అగ్నిని కోరాడు. ఈ సంగతి తెలియని జరిత కుమారులను ఎలా రక్షించుకోవాలా అని దుఃఖిస్తున్న వైనం.

ఇతిహసం: (ప్రక్రియ)

3)

1.భారత, రామాయణాలను ఇతిహసాలంటారు.

2.తొల్లిటి కథలే ఇతిహసాలు.

3.ఇవి గ్రంథస్తం కాక ముందు ఆశురూపంలో ఉండేవి.

4.కథా కథనానికి ప్రాధాన్యం ఎక్కువ

4) **జరితారి-పాత్ర స్వభావం**

మందపాలుడు జరితల అగ్రతనయుడు జరితారి. పుట్టుకతోనే బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. తల్లి బిలంలో దూరమన్నప్పుడు బిలంలో దూరడం కంటే మంటల్లో కాలి పుణ్యలోకాలు పొందడం మంచిది అని చెప్పిన వాడు. ఆపద సంభవించినపుడు ఖచ్చితంగా జరుగుతుందన్న పని చేయకూడదని పలికిన వివేచనా పరుడు. తల్లిపై మమకారాన్ని కల్గిన పుత్రుడు.

5) **పర్యాయపదాలు**

1. తరువు - వృక్షం, చెట్టు, భూరూహము.

2.హవ్యవాహనుడు - వాయుసారథి, జ్వలనుడు, అగ్ని.

3.గగనం - ఆకాశము, అంతరిక్షము. నభము.

4.తనయుడు - పుత్రుడు, కుమారుడు, సుతుడు

5.పక్షి - ఖగం, పులుగు, విహంగం

6) **వ్యుత్పత్యర్థాలు**

1.హుతభుక్కు - హుతమును భుజించువాడు (అగ్ని)

2.భూరూహం - భూమి యందు పుట్టునది (చెట్టు)

3.పుత్రుడు - పున్నామ నరకం నుంచి రక్షించువాడు (కుమారుడు)

4.హవ్యవాహనుడు - హవ్యమును మోసుకొని పోవువాడు (అగ్ని)

5. జ్వలనుడు - మండెడి స్వభావము కలవాడు (అగ్ని)

6. వాయుసారథి - వాయువు సారథిగా కలవాడు (అగ్ని)

7.పక్షి - పక్షములు కలది(పులుగు)

7) **అర్థాలు**

1.బిలము - రంధ్రం

2.గుల్మము - పొద

3.జవము – వేగం

4.గహనము – అడవి, దట్టమైన

5.కృచ్ఛ్రంబు – కష్టం,బాధ.

8) **నానార్థాలు**

1.క్రియ – పని, వలె, చికిత్స, పూజ

2.లావు – బలము, సామర్థ్యము, శక్యము.

9) **విగ్రహవాక్యాన్ని సమాసంగా కూర్చుట.**

1.బ్రహ్మను తెలిసినవారు – బ్రహ్మవిత్తములు

2.అహ్నం మధ్యభాగం – మధ్యాహ్నం

3. అగ్ని వల్ల భయం – అగ్ని భయం

10) **సమాసానికి ఉదాహరణ**

1.ద్వితియా తత్పురుష – బ్రహ్మవిత్తములు

2.షష్ఠీ తత్పురుష – బ్రహ్మముఖములు

11) **సంధిని విడదీయుట**

1. ప్రళయాగ్ని – ప్రళయ+అగ్ని

2.మహత్మ – మహ+ఆత్మ

12) **సంధి కార్యం**

1. ప్రళయాగ్ని – ప్రళయ+అగ్ని. సవర్ణదీర్ఘ సంధి.

సూత్రం: అ,ఇ,ఉ,ఋ లకు అవే అచ్చులు పరమైతే వాని దీర్ఘమేకాదేశమగును.

13) **ప్రకృతి – వికృతి**

1.అగ్ని – అగ్గి

2.దిశ – దెస

3.పుత్రుడు – బొట్టెడు

4.బ్రహ్మ – బమ్మ

5.శిఖ – సిగ

14) **విధి కృతము గడవ నేరగ లావే! (ఇందుగల అలంకారం)**

అర్థాంతరన్యాసాలంకారం. (విశేషాన్ని సామాన్యంతో సమర్థించడం జరిగింది)

15) **కంఠస్త పద్యములు**

1.ఇది ప్రళయాగ్ని వోలె.....దాకకుండగన్

2.కొడుకుల బ్రహ్మవిత్తముల.....దలంప కక్కటా.

2. జడివాన

I 1) కింది పద్యాలకు ప్రతి పదార్థములు రాయండి

ఇది కల్పాంతమొ యిమ్మహోగ్ర సలిలం బేకార్ణవాకారమై
పొదలం జూచెనో యింతతోన జగముల్ పోఁజేసెనో ధాతయె
య్యది దిక్కెక్కడ సొత్తు మెవ్విధమునం బ్రాణంబు రక్షించుకో
లొదవున్ దైవమ యంచు గోప నివహం బుద్వేగ మెందెన్మదిన్.

పరిచయం: పై పద్యం ఎర్రన రచించిన హరివంశం పూర్వభాగం ఏడవ ఆశ్వాసం లోని'జడివాన' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: రేపల్లె ప్రజలు ఇంద్రపూజకు బదులు గోవర్ధన గిరిని పూజించినందుకు ఇంద్రుడు కోపించి రేపల్లెపై జడివానను కురిపించిన సందర్భం.

ప్రతిపదార్థం:

దైవమా-ఓ భగవంతుడా!
ఇది-ఇది
కల్ప+అంతమో-ప్రళయమా!
ఈ-ఈ
మహా+ఉగ్ర-భయంకరమైన
సలిలంబు-నీరు
ఏక+అర్ణవ-ఒకే సముద్ర
ఆకారమై-రూపమై
పొదలన్-పొంగుటకు
చూచెనో-చూస్తున్నదా!
ఇంతతోన-ఇంతటితో
జగముల్-లోకాలను
ధాతయె- బ్రహ్మ
పోజేసెనో-నాశనం చేయదలచాడా!
దిక్కు-మాకు దిక్కు
ఏ+అది-ఏది
ఎక్కడ-ఎక్కడికి
చొత్తుము-వెళ్ళాలి.

ప్రాణంబు-ప్రాణాలు

రక్షించుకోలు-కాపాడుకోవటం

ఒదవున్-ఎలా

అంచున్-అని

గోప నివహంబు-గోపకుల గుంపు

మదిన్-మనస్సులో

ఉద్వేగ మొందెన్-ఆందోళన చెందింది.

భావం: ఇది ప్రళయమా? ఈ భయంకరమైన నీరంతా ఒకేరూపంగా మారి పొంగాలను కొంటోందా? బ్రహ్మ ఇంతటితో లోకాల్ని నాశనం చేయదలచాడా మాకు దిక్కేది? ఎక్కడికి పోవాలి? ప్రాణాలు ఎలా కాపాడుకోవాలి? అని గోపాలకులు ఆందోళన చెందారు.

2) **భువనైక ప్రభుఁడైన యింద్రునకు సంపూజ్యంబుగా జేయును**
త్సవమే నర్హుఁడనే హరింప నన కుత్సాహంబుతో.. బూజగొ
న్న విహీనాత్ముని మేము సైపమనచున్ శక్రాజ్ఞ గోవర్ధనా
ద్రి వెసం ద్రొక్కెడు నాగ్ర జుట్టుకొని యుద్రేకించె జీమూతముల్.

పరిచయం: పై పద్యం ఎర్రన రచించిన హరివంశం పూర్వభాగం ఏడవ ఆశ్వాసం లోని'జడివాన' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: రేపల్లె ప్రజలు ఇంద్రపూజకు బదులు గోవర్ధన గిరిని పూజించినందుకు ఇంద్రుడు కోపించి జడివానను కురిపించిన సందర్భం.

ప్రతి పదార్థం:

భువన+ఏక-లోకాలకు

ప్రభుడైన-ప్రభువైన

ఇంద్రునకున్-దేవేంద్రునికి

సంపూజ్యంబుగాన్-గౌరవంతో

చేయు-చేసే

ఉత్సవము-వేడుక

ఏను-నేను

హరింపన్-హరించుటకు

అర్హుడనా-తగినవాడినా?

అనక-ఆలోచించక

ఉత్సాహంబుతో-ఆనందంతో

పూజగొన్న-పూజను స్వీకరించిన

విహీన+ఆత్మని-గోవర్ధన గిరిని

మేము సైపమనచున్-మేము సహింపమనచూ

శక్రాజ్ఞ-ఇంద్రుని ఆజ్ఞతో

గోవర్ధన+అద్రిన్-గోవర్ధన గిరిని

వెసన్-వేగంగా

త్రొక్కెడు నాగన్-అణచివేసే వాటిలా

చుట్టుకొని-ఆవరించి

జీమూతముల్-మేఘాలు

ఉద్రేకించెన్-విజృంభించాయి.

భావం: లోకాలకు ఒకే ప్రభువు ఇంద్రుడు. ఆయనకు గౌరవంగా చేసే పూజకు తాను అర్హుడేనా అని ఆలోచించక పూజగొన్న ఈ హీనున్ని మేము సహించమూ అంటూ ఇంద్రుని ఆజ్ఞతో గోవర్ధన గిరిని అణచివేస్తున్నాయన్నట్లుగా మేఘాలు విజృంభించాయని భావం.

II సందర్భాలు

1) గోప నివహం బుద్వేగ మొందెన్మదిన్

పరిచయం: ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశం పూర్వభాగం ఏడవ ఆశ్వాసం లోని'జడివాన' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భము: ఇంద్రుడు రేపల్లె పై కోపించి భయంకరమైన జడివాన కురిపించాడు. ఆ వాన భూమి, ఆకాశాల మధ్య అంతరం లేకుండా విజృంభించింది. ఇది ప్రళయమా? ఈ భయంకరమైన నీరంతా ఒకే రూపమై మారి పొంగాలను కొంటోందా! బ్రహ్మ ఇంతటితో లోకాల్ని నాశనం చేయదలచాడా! అని గోపాలకులు ఆందోళన చెందిన సందర్భం లోనిది.

భావం: భయంకరమైన వర్షాన్ని చూచి గోపకుల గుంపు మనస్సులో ఆందోళన చెందిందని భావం.

2) సమస్త ప్రాణి బాధకంబై పేర్చెన్.

పరిచయం: ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశం పూర్వభాగం ఏడవ ఆశ్వాసం లోని'జడివాన' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: ఇంద్రుడు రేపల్లెపై భయంకరమైన జడివాన కురిపించాడు. ఆ జడివాన పశువుల కోసం పన్నిన వలలాగా విజృంభించి జంతువులన్నింటినీ నాశనం చేసింది. అంతటితో తృప్తి పడక అన్ని ప్రాణుల్ని బాధిస్తూ చెలరేగిందని చెప్పిన సందర్భం లోనిది.

భావం : జడివాన కేవలం జంతువులనేకాక అన్ని ప్రాణుల్ని బాధిస్తూ విజృంభించింది.

II **పద్యభావం రాయండి**

1 **పసులకు నొడ్డిన వలయై**

మసఁగిన యవ్వాన పశు సమాజమునెల్లన్

బసగర గొని యంతటిఁబో

క సమస్త ప్రాణి బాధకంబై పేర్చెన్.

భావం: పశువుల కోసం పన్నిన వలగా విజృంభించిన వాన జంతు సంతతినంతా నశింప జేసింది. అంతటితో తృప్తి చెందక సమస్త ప్రాణులకూ బాధ కలిగిస్తూ చెలరేగింది.

III **మహావర్షం విస్తరించిన విధానం రాయండి?(లేదా) జడివాన వల్ల కలిగిన బాధలు వివరించండి?**

ఈ పాఠ్యభాగం ఎర్రన రచించిన హరివంశం పూర్వభాగం ఏడవ ఆశ్వాసం నుంచి స్వీకరించినది . రేపల్లె పై ఇంద్రుడు కోపించి జడివానను కురిపించిన సందర్భం

మేఘాల విజృంభణ: దట్టమైన మేఘాలు దిక్కుల చివరపుట్టి ఆకాశాన్ని కప్పివేసాయి. ఆడ ఏనుగుల పిల్లలు ఆకాశమంతా వ్యాపించినట్లుగా, కుల పర్వతాలు కూలి ఆకాశంలో వెలసినట్లుగా, పాతాళంలోని చీకట్లు సూర్యున్ని మింగడానికి వచ్చినట్లుగా, సముద్రాలు చెలరేగి అలలతో ఆకాశంపైకి ఎక్కుతున్నట్లుగా వుంది. ఆకాశం నిండా మెరుపులు. పిడుగులూ, రాళ్లూ పుట్టాయి.

ఇది ప్రళయమా? ఈ నీరంతా సముద్రంగా మారి పొంగుతుందా? బ్రహ్మలోకాల్ని నాశనం చేయదలచాడా? తమకి దిక్కెవరు అని గోపకులు ఆందోళన చెందారు. గోవర్ధన పర్వతాన్ని అణచివేస్తున్నాయో అన్నట్లు మేఘాలు విజృంభించాయి.

జంతువుల దుస్థితి

పశువుల కోసం పన్నిన వలగా విజృంభించిన వాన జంతు సంతతినంతా నశింపజేసింది. అంతటితో తృప్తిపడక సమస్త ప్రాణులనూ బాధిస్తూ చెలరేగింది. గూహల్లోని సింహల గుండెలు అదిరి కదలకుండా ఎక్కడివక్కడే నిలబడి పోయాయి. ఇక మిగిలిన జంతువుల పరిస్థితి చెప్పేదేముంది.

వృక్షాల పరిస్థితి

పిడుగులు పడి కాలి కొన్నిచెట్లు, బలమైన గాలులకు విరిగి కొన్ని చెట్లు, నీటి ప్రవాహ వేగం వల్ల మరికొన్ని చెట్లు ఇలా అనంతమైన వృక్షరాశికి దుఃఖస్థితి కలిగింది.

పక్షుల దమనీయ స్థితి

విడుపులేకుండా కురుస్తున్న వానకు అడవిలోని పక్షులు ఎక్కడికీ వెళ్లలేక ఆకలితో కృశించి, రెక్కలు జారగా, గూళ్ళలో, చెట్ల కొమ్మల సందుల్లో నిలవలేక బలమైన గాలులకు తూలి ఎక్కడివక్కడే చచ్చి ప్రవాహంలో తేలాయి.

పైవిధంగా మహవర్షం విస్తరించి అన్ని ప్రాణుల్ని బాధించింది.

IV

1) **పాఠ్యకర్త**

కవి	: ఎర్రన
కాలం	: 14 వ శతాబ్దం
బిరుదులు	: శంభు దాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు.
పాఠ్యభాగ స్వీకారం	: హరివంశం పూర్వభాగం ఏడవ ఆశ్వాసం నుంచి
ఇతర రచనలు	: రామాయణం, నృసింహ పురాణం

2) **నేపథ్యం:** తగిన సమయంలో వర్షాలు కురవాలి పంటలు పండాలి. చెట్లు అభివృద్ధి చెందాలి. పశువులు ఆరోగ్య సంపదతో వర్ధిల్లాలి. ఇందుకై గోపాలకులు ఏటేటా ఇంద్రపూజ చేసేవారు. కృష్ణుని ఆజ్ఞ మేరకు ఇంద్రపూజకు బదులు గోవర్ధన గిరిని పూజించినందుకు ఇంద్రుడు రేపల్లెపై భయంకర వర్షాన్ని కురిపించాడు.

3) **పర్యాయ పదాలు**

వాతం-పవనం, గాలి, మారుతం

మేఘం-అభ్రము, జీమూతం, పయోధరం

జలధి- అంబుధి, కడలి, పయోధి.

నివహం-సమూహము,గుంపు, బృందం, మూక

4) **వ్యుత్పత్యర్థాలు**

అచలం-చలనము లేనిది (కొండ)

ధ్వాంతం-దారికానరాక ఇందు మొర పెట్టుదురు (చీకటి)

ఆసారం-అంతటా పడు నట్టిది.(వాన)

పయోధరం- నీటిని ధరించునది (మేఘము)

శక్రుడు-దుష్టులను శిక్షించువాడు (ఇంద్రుడు)

5) **అర్థాలు**

1.ధ్వాంతము-చీకటి,

2.జలధి-సముద్రం,

3.శక్రుడు-ఇంద్రుడు,

4.కులాయం-గూడు,

5.సంపూజ్యం-గౌరవం

6) **నానార్థాలు**

దాహము-దప్పిక, కాల్చుట, కోరిక

వల-ప్రేమ, చేపలు పట్టేసాధనం, వైపు

ధాత-సంవత్సరం, బ్రహ్మ, శివుడు.

7) **సమాస పదాలు**

శక్రాజ్ఞ–శక్రుని యొక్క ఆజ్ఞ–షష్ఠీతత్పురుష సమాసం

పురుషోత్తముడు–ఉత్తముడైన పురుషుడు–విశేషణోత్తర పద కర్మధారయ సమాసం

గోవర్ధనాద్రి–గోవర్ధనమనే పేరు గల అద్రి–సంభావన పూర్వపద కర్మధారయ సమాసం

విహీనాత్ముడు–విహీనమైన ఆత్మకలవాడు–బహువ్రీహీ సమాసం

8) **విడదీసి, సంధి కార్యములు తెలపండి**

1.గోత్రాచలం–గోత్ర+అచలము–సవర్ణదీర్ఘ సంధి.

2.శక్రాజ్ఞ–శక్ర+ ఆజ్ఞ– సవర్ణదీర్ఘ సంధి.

3.ఇతరేతర–ఇతర+ఇతర–గుణసంధి.

4.అప్పయోధరముల్–ఆ+పయోధరములు–త్రికసంధి.

5.ప్రభుడైన–ప్రభుడు+వెన–ఉకారసంధి.

9) **ప్రకృతి–వికృతి**

మేఘము–మొయిలు

పశువు–పసరము

మృగము–మెకము

వృద్ధి–వద్ది

కులాయము–గూడు

10) **అలంకారాన్ని గుర్తించుట**

1. పాతాళమున నున్న బంధుర ధ్వాంతముల్

వెడలి భామని మ్రింగ నడరె ననగ – దీనిలో అలంకారం

ఊహ ప్రధానం

కాబట్టి–ఉత్ప్రేక్షాలంకారం

2. గోత్రా చలంబుల చిత్ర వాతాహతి

వెస బెల్లగిలి మీద వెలసె ననగ –దీనిలో అలంకారం

ఊహ ప్రధానం

కాబట్టి–ఉత్ప్రేక్షాలంకారం

11) **కంఠస్థ పద్యాలు**

నిడుజడిదాకి.....వెల్లువన్.

భువైనక.....జీమూతముల్

3. ప్రవరుని స్వగతం

I **ప్రతిపదార్థం రాయండి.**

తలమే బ్రహ్మకు నైన నీనగ మహత్వం బెన్న? నే నియ్యడన్
గల చోద్యంబులు తేపు గన్గొని యెదన్ గకేమి నేఁ దే ఁగెదన్
నలినీ భాంధవ భాను తప్త రవికాంత స్యంది నీహారకం
దళచూత్కార పరంపరల్ పయిపయిన్ మధ్యాహ్నమున్ దెల్పెడిన్.

పరిచయం: పైపద్యం అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర నుంచి గ్రహించిన 'ప్రవరుని స్వగతం' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: సిద్ధుడిచ్చిన పాదలేపం రాసుకొని ప్రవరుడు హిమాలయాలకు వెళ్లిన సందర్భం.

ప్రతిపదార్థం:

ఈ నగ మహత్యంబు – ఈ హిమలయ పర్వత మహిమను
ఎన్నన్ – ప్రశంసించుటకు
బ్రహ్మకునైన – బ్రహ్మదేవుడికైనా,
తలమే – సాధ్యమా!
నేను – నేను
ఈ+ఎడన్ – ఈ హిమాలయమునందు
కల – ఉన్నట్టి
చోద్యంబులు – వింతలు
తేపు – రేపు
కన్గొనియెదన్ – చూస్తాను
కాక – అలాకాక
ఏమి – తొందరేమి
నేడు+ఎగెదన్ – ఈ రోజు పోతాను
నలినీ – తామరలకు
బాంధవ – మిత్రుడైన
భాను – సూర్యునివల్ల
తప్త – వేడెక్కిన
రవికాంత – సూర్యకాంత శిలలపై
స్యంది – పడుతున్న

నీహార కందళ – మంచు నీటి బొట్లవల్ల

చూత్కార – చుయ్‌చుయ్‌మనే ధ్వనులు

పరంపరలు – వరుసలు

పయిపయిన్ – క్రమక్రమంగా

మధ్యాహ్నమున్ – మధ్యాహ్న సమయాన్ని

తెల్పెదిన్ – తెలియ జేస్తున్నాయి.

భావం: ఈ హిమాలయ పర్వతాన్ని వర్ణించడానికి బ్రహ్మకైనా సాధ్యమా! సూర్యకిరణాల వల్ల వేడెక్కిన సూర్యకాంత మణులపైన మధ్యాహ్నపుటెండ వల్ల మంచు కరిగి చుఁయిమని చప్పుళ్లు చేస్తున్నాయి. మధ్యాహ్నమైనట్లుంది. ఈరోజుకు ఇంటికి తిరిగి వెళ్లి, ఇక్కడ ఉన్న వింతల్ని రేపు వచ్చి చూస్తాను.

సందర్భాలు:

1. దైవకృతమున కిల నసాధ్యంబు గలదె

పరిచయం: పై వాక్యం అల్లసాని పెద్దన రచనైన మనుచరిత్ర నుంచి గ్రహించిన 'ప్రవరుని స్వగతం' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భము: సిద్దుడిచ్చిన పాదలేపంతో ప్రవరుడు హిమాలయాలకు వెళ్ళి అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని మైమరచి చూస్తున్నాడు. సూర్య కిరణాలచే వేడెక్కిన మంచు కరిగి చుఁయ్ మని చప్పుళ్లు చేస్తూ ప్రవహిస్తుంటే మధ్యాహ్నమైనట్లుంది. ఈరోజు ఇంటికి తిరిగి ఇక్కడి వింతల్ని రేపు వచ్చి చూద్దామని ప్రవరుడు అనుకొన్నాడు. అయితే మంచు నీరు తగలడం వల్ల అతని కాళ్లకు ఉన్న పసరు కరిగిపోయింది. ఈ విషయం ప్రవరునికి తెలియదు అని కవి చెప్పిన సందర్భం.

భావం : భగవంతుడు తలపెట్టిన కార్యం ఖచ్చితంగా జరుగుతుంది. దేవుడు తలపెట్టిన దానికి అసాధ్యం లేదు.

2) వెడలు తెరువెయ్యదియో!

పరిచయం: పైవాక్యం అల్లసాని పెద్దన రచనైన మనుచరిత్ర నుంచి గ్రహించిన 'ప్రవరుని స్వగతం' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: ప్రవరుడు సిద్దుడిచ్చిన పాదలేపంతో హిమాలయాలకు వెళ్ళాడు. ప్రకృతి అందాలను చూచి పరవశించాడు. మంచునీటికి పాదలేపం కరిగిపోయింది. ఈ సంగతి గ్రహించని ప్రవరుడు తన స్వ గ్రామానికి వెళ్లదలచి ప్రయత్నించగా ఫలించలేదు. కారణాన్ని గ్రహించి ప్రవరుడు చింతిస్తున్న సందర్భం లోనిది.

భావం: అరుణాస్పద పురం ఎక్కడ? హిమలయాలెక్కడ? ఇవేమీ ఆలోచించక ఇటు రావచ్చునా? ఇక్కడి నుంచి బయటపడే మార్గం ఏమిటో తెలియదు కదా! అని భావం.

III **పద్యభావం రాయండి**

అనుచు గ్రమ్మఱువేళ నీహరవారి
బెరసి తత్పాద లేపంబు గరిఁగి పోయెఁ
గర..గి పోవుట యెఱుఁగ డద్దరణి సురుఁడు
దైవకృతమున కిల నసాధ్యంబు గలదె!

భావం: తన మనసులో ఇక్కడ ఉన్న వింతలు రేపువచ్చి చుద్దామని మనసులో నిర్ణయించుకొన్న ప్రవరుడు స్వగ్రామానికి బయలు దేర దలచాడు. మంచునీరు తగిలి పసరుపూత కరిగిపోయింది. ఈ విషయం ప్రవరునికి తెలియదు. భగవంతుని లీలలకు సాధ్యము కానిది లేదు కదా!

IV **హిమాలయ పర్వతం గురించి ప్రవరుడు ఏమనుకొన్నాడు?**

అల్లసాని పెద్దన మనుచరిత్ర ద్వితీయా శ్వాసం నుంచి గ్రహించిన పాఠ్యభాగం ప్రవరుని స్వగతం. ప్రవరుడు అరుణాస్పదపురంలో నివసించే బ్రాహ్మణ గృహస్థుడు. నిష్ఠాగరిష్ఠుడు, అతిథి అభ్యాగతులకు మర్యాదలు చేస్తూ ఉండే వ్యక్తి. తీర్థయాత్రలంటే ప్రీతి. సిద్ధుడు పూసిన పాదలేపం సాయంతో హిమాలయాలకు వెళ్లాడు. అక్కడ ఆకాశాన్నంటే శిఖరాలని, గలగలా ప్రవహించే సెలయేళ్లని చూశాడు. ఆ చప్పుళ్లు మృదంగ నాదాలుగా భావించి నెమళ్లు నాట్యమాడే సన్నివేశం చూశాడు. ఆ లోయల్లో ఏనుగులు తొండాలతో చెట్ల కొమ్మలను ఊపుతుంటే చూశాడు. మధ్యాహ్న సూర్యుని ఎండకు వేడెక్కిన మంచు కరిగి సూర్యకాంతమణులుపై పడుతూండడంతో చుయ్‌చుయ్ మనే శబ్దాలు వివిపిస్తున్నాయి.

హిమాలయ పర్వతాన్ని వర్ణించడానికి బ్రహ్మకైనా సాధ్యం కాదు కదా అని అనుకొన్న ప్రవరుడు మిగిలిన వింతల్ని రేపు చూద్దామనుకొని తిరిగి ఇంటికి బయల్దేరదలచాడు. మంచునీరు తగలడం చేత అతని కాళ్లకున్న పసరుపూత కరిగి పోయింది. ఈ విషయం ప్రవరునికి తెలియదు. దైవనిర్ణయాన్ని ఎవరూ తప్పించలేరు! అరుణాస్పదపురం వెళ్ళాలను కొన్న ప్రవరుని ప్రయత్నం ఫలించలేదు.చివరికి పాదలేపం కరిగిపోయిందని గ్రహించిన ప్రవరుడు ఓ దేవా! సిద్ధుడనే నెపంతో నన్ను ఈ అరణ్యంలో పడేశావా! ఇక్కడి నుంచి బయటపడేమార్గమేమిటో తెలియడంలేదే,నాకోసం నా తల్లిదండ్రులు, నా భార్య, శిష్యులు ఎంతగా వేదన చెందుతున్నారో! నిత్యాగ్ని హోత్రాలు ఏమయ్యాయో అని చింతించాడు.

V

1) **పాఠ్యకర్త**

కవి – అల్లసాని పెద్దన

కాలం – 16 వ శతాబ్దం

బిరుదు – ఆంధ్ర కవితా పితామహుడు

పాఠ్యభాగ స్వీకారం – మనుచరిత్ర ద్వితీయాశ్వాసం

కవితాలక్షణం – అల్లసాని వారి అల్లిక జిగిబిగి

2) **ప్రబంధం – ప్రక్రియ**

పురాణేతిహాసాల నుంచి చిన్న కథను తీసుకొని అష్టాదశ వర్ణనలతో పెంచి మహాకావ్యం రచిస్తే దానిని ప్రబంధం అంటారు. ప్రకృష్టమైన పదబంధం ఉంటుంది.

3) **ప్రవరుని స్వగతం – నేపథ్యం**

ప్రవరుడు అరుణాస్పదపుర నివాసి. నిష్టాగరిష్ఠుడు,బ్రాహ్మణ శ్రేష్ఠుడు. అతిథి అభ్యాగతులకు సపర్యలు చేస్తూ వుండే వ్యక్తి. తీర్థయాత్రలంటే ప్రీతి. అతిథిగా తన ఇంటికి వచ్చిన సిద్ధుడు పూసిన పాదలేపంతో హిమాలయాలకు వెళ్లడమే ఈ పాఠ్యభాగ నేపథ్యం

4) **పద్యపూరణం**

అటజని కాంచె..... శైలమున్.

5) **పర్యాయ పదాలు**

తెరువు – దారి,మార్గం, పథం

నీహారం – మంచు, హిమం, తుహినం

కులకాంత – భార్య, పత్ని, ఇల్లాలు

నగం – అద్రి, పర్వతం, శైలము

6) **వ్యుత్పత్యర్థాలు**

నళినీ భాందవుడు – తామరులకు చుట్టము (సూర్యుడు)

కలాపి – ఫించములు కలది (నెమలి)

7) **అర్థాలు**

అపదేశం – మిష, నెపము, వంక

కరేణువు – ఆడ ఏనుగు

కలాపం – ఫించం

8) **నానార్థాలు**

కరం – చేయి, తొండం,మిక్కిలి

అంబరం – శూన్యం, వస్త్రం, ఆకాశము

చరణము – పాదం, వేదభాగం, పర్యపాదం

9) **సమాసాలు**

అసాధ్యము – సాధ్యం కానిది – నఞ్ తత్పురుష సమాసము

దైవకృతం – దైవము చేత కృతం – తృతీయా తత్పురుష సమాసము

ఘోరవనం – ఘోర మైన వనము – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

అరుణాస్పదపురం – అరుణాస్పదమనే పేరుగల పురం

– సంభావనా పూర్వపద కర్మధారయసమాసము

10) సంధి కార్యములు

సిద్దాప దేశంబు – సిద్ద+అపదేశంబు – సవర్ణదీర్ఘసంధి

కౌతుకోద్దతి – కౌతుక+ఉద్దతి – గుణసంధి

అతడట్లు – అతడు+అట్లు – ఉత్వసంధి

దిక్కిది – దిక్కు+ఇది – ఉత్వసంధి

మేనత్త – మేన+అత్త – అత్వసంధి

11) ప్రకృతి – వికృతి

చోద్యం – సోద్దెము

బ్రహ్మ – బొమ్మ

యాత్ర – జాతర

పురి – ప్రోలు

సంధ్య – సంజ

12) ''దైవకృతమున కిల నసాధ్యంబు గలదె'' దీనిలో అలంకారం

'అర్థాంతర న్యాసాలంకారం'

సామాన్యాన్ని విశేషం చేత సమర్థించడం జరిగింది.

సుభాషితాలు

I **కింది పద్యాలకు ప్రతి పదార్థాలు రాయండి**

ఆకాంశబున నుండి శంభుని శిరం, బందుండి శీతాద్రి,సు
శ్లోకంబైన హిమాద్రి నుండి భువి, భూ లోకంబు నందుండి, య
స్తోకాంభోధి పయోధి నుండి పవనాంధో లోకమున్ చేరె గం
గా కూలంకష, పెక్కుభంగులు వివేక భ్రష్ట సంపాతముల్.

పరిచయం: ఈ పద్యం ఏనుగు లక్ష్మణ కవి రచించిన సుభాషిత రత్నావళి నుంచి గ్రహించినది.

సందర్భం: వివేక హీనుని పతనాలని వర్ణించే సందర్భం

ప్రతిపదార్థం:

గంగా కూలంకష – గంగానది
ఆకాశంబున నుండి – ఆకాశం నుంచి
శంభుని – శివుని
శిరంబు – తలమీదకు
అందుండి – శివుని తలమీద నుంచి
శీత+అద్రి – హిమాలయ పర్వతంపైకి
సుశ్లోకంబైన – కీర్తి వంతమైన
హిమ+అద్రినుండి – హిమాలయ పర్వతమునుంచి
భువిన్ – భూలోకమునకు
భూలోకంబు నందునుండి – భూలోకం నుంచి
అస్తోక+అంబుధి – మహాసముద్రానికి
పయోధినుండి – ఆ సముద్రమునుంచి
పవన+ అంధోలోకమున్ – పాతాళానికి
చేరెన్ – చేరింది
వివేక భ్రష్ట – తెలివిని కోల్పోయినవారి
సంపాతముల్ – పతనాలు
పెక్కుభంగులు – అనేక విధాలు.

భావం: ఆకాశం నుంచి శివుని తలమీదకు, అక్కడ్నుంచి హిమాలయాల మీదకు, అక్కడి నుంచి భూమి మీదకు, అక్కడి నుంచి సముద్రం లోకి, సముద్రం నుంచి పాతాళానికి గంగ చేరింది. వివేకం కోల్పోయిన వారి పతనాలు అనేక విధాలుగా వుంటాయి.

2) తమయుదకంబులన్నదులు త్రావవు స్వీయఫలంబు లెల్ల వృ
క్షములు భుజింప వభ్రములు సస్యములందిన వట్లుగా మ హో
త్తమ పురుషార్జితంబయిన ద్రవ్య మహర్నిశమున్ బరోప కా
రమునకె మౌను సమ్ము రఘు రామ దయాహృదయా శుభోదయా!

పరిచయం: పై పద్యం అల్లంరాజు రంగశాయికవి రచించిన రఘురామ శతకం నుంచి గ్రహించినది.

సందర్భం: మహత్ముల గొప్పతనం వర్ణించే సందర్భం.

ప్రతిపదార్థం:

రఘురామ – రఘు వంశంలోని రామా!

దయాహృదయా – దయా హృదయం కలవాడా!

శుభ+ఉదయా – సకల శుభాలను ఇచ్చేవాడా!

తమ – తమలోని

ఉదకంబులన్ – నీటిని

అ+నదులు – ఆ నదులు

త్రావవు – తాగవు

ఎల్లన్ – అన్ని

వృక్షములు – చెట్లూ

స్వీయ ఫలంబులు – తమ ఫలాలను

భుజింపవు – తినవు

అభ్రములు – మేఘములు

సస్యములన్ – పంటలను

తినవు – తినవు

అట్లుగా – అదేవిధంగా

మహ+ఉత్తమ – మిక్కిలి గొప్పవారైన

పురుష – వ్యక్తులు

ఆర్జితంబు+అయిన – సంపాదించిన

ద్రవ్యము – ధనము

అహర్నిశమున్ – ఎల్లప్పుడూ

పర – ఇతరులకు

ఉపకారమునకె – మేలు చేయుట

ఔనుసుమ్ము – కోసమే కదా!

భావం: దయా హృదయం కలిగిన ఓ రామా! నదులు నీళ్లు తాగవు. చెట్లు తమ ఫలాలని తినవు. అదే విధంగా ఉత్తములు సంపాదించిన సంపద ఎల్ల వేళలా పరోపకారానికే సుమా!

II **పద్యభావములు**

అన్నమయములైన వన్ని జీవమ్ములు
కూడ లేక జీవకోటి లేదు.
కూడు తినెడికాడ కులభేద మేలకో!
కాళికాంబ! హంస! కాళికాంబ!

భావం:

ఓకాళికాంబా! సమస్త జీవులు అన్నంతోనే పొట్ట నింపు కొంటాయి కూడు లేక పోతే ప్రాణ కోటిలేనే లేదు. మరి అందరికీ అవసరమైన తిండి తినే చోట కులభేదాలు ఎందుకు!

III **సందర్భాలు**

1) పెక్కుభంగులు వివేక భ్రష్ట సంపాతముల్.

పరిచయం: ఈ వాక్యం ఏనుగు లక్ష్మణ కవి రచనైన సుభాషిత రత్నావళి నుంచి స్వీకరించిన సుభాషితాలు అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: గంగానది ఆకాశం నుంచి శివుని తలపైకి, అక్కడినుంచి హిమాలయాలకు, హిమాలయాలనుంచి భూమికి అలా క్రమక్రమంగా దిగజారింది. చివరకు పాతాళం చేరింది.వివేక హీనుని పతనాలు ఈవిధంగా ఉంటాయని కవి చెప్పే సందర్భం.

భావం: వివేక ం కోల్పోయిన వారి పాట్లు అనేక విధాలుగా ఉంటాయి. వారి చేష్టలు వారి పతనానికి మూలకారణం.

2) అభ్రములు సస్యములందినవు

పరిచయం: ఈ వాక్యం ఏనుగు లక్ష్మణ కవి రచనైన సుభాషిత రత్నావళి నుంచి స్వీకరించిన సుభాషితాలు అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: నదులు తమ నీటిని తాము తాగవు. వృక్షాలు తమ ఫలాలను తాము తినవు. అదే విధంగా మహత్ములు తమ సంపదని పరులకై ఉపయోగిస్తారని కవి చెప్పిన సందర్భం లోనిది.

భావం: మేఘాలు వర్షాలని కురిపిస్తాయి. వర్షపు నీటికి పంటలు పండుతాయి. పండిన ఆ పంటలని మేఘాలు తినవు. అదేవిధంగా ఉత్తములు సంపాదించిన ధనాన్ని పరోపకారం కోసమే వినియోగిస్తారు.

IV **పద్యాన్ని పూరించండి**

1) ఆకాశంబున నుండి.....సంపాతముల్

2) ఉరుతర పర్వతాగ్రమున నుండి.....చూడగన్

V 1. **శతకం – ప్రక్రియ**

వంద (లేదా) నూట ఎనిమిది పద్యాల సమాహారాన్ని శతకం అంటారు.

ఇవి ఏపద్యానికా పద్యం ప్రత్యేక అర్థం కలిగి వుంటాయి. వీటికి చివర మకుటం ఉంటుంది. నీతిని, భక్తిని బోధిస్తాయి.

2. **పర్యాయ పదాలు**

కాయం – తనువు, దేహం, శరీరం

సఖ్యం – స్నేహం, మైత్రి, చెలిమి

కేలు – హస్తము, చేయి, కరం

3. **వ్యుత్పత్యర్థాలు**

1. కూలంకష – ఒడ్డును ఒరసుకొని ప్రవహించేది (నది)

2. శంభుడు – సుఖాలను కలిగించే వాడు (శివుడు)

4. **అర్థాలు**

1. అభ్రం – మేఘం

2. వాయి – నోరు

3. తక్కిడి – మోసం

5. **సమాసపదాలు**

ప్రియభాషలు – ప్రియములైన భాషలు – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

పొట్టకూడు – పొట్ట కొరకు కూడు – చతుర్థీతత్పురుష సమాసం

అహర్నిశలు – అహస్సు, నిశ – ద్వంద్వసమాసం

తోడునీడలు – తోడును, నీడయును – ద్వంద్వసమాసం

6. **నానార్థాలు**

ధర్మం – న్యాయం, నీతి, పుణ్యం

అభ్రం – ఆకాశం, మబ్బు

కోటి – నూరులక్షలు, అంచు, సముదాయము.

7. **సంధి కార్యములు**

1. శీతాద్రి – శీత+అద్రి – సవర్ణ దీర్ఘసంధి

2. అస్తోకాంభోధి – అస్తోక+అంబుధి – సవర్ణదీర్ఘసంధి

3. మహోత్తమ – మహ+ఉత్తమ – గుణసంధి

4. అదెట్లు – అది+ఎట్లు – ఉకారసంధి

5. కేలిడుట – కేలు+ఇడుట – ఉకారసంధి

ఆకాశము	–	ఆకసం
నీరము	–	నీరు
భాష	–	బాస
కులము	–	కొలము
జ్యోతిషము	–	జోస్యము
హృదయము	–	ఎద, ఎడద

సందేశము

I **ప్రతిపదార్థం రాయండి**

ఎవరో మోక్షము నిచ్చువారలని మీకేలా వృథా భ్రాంతి, మీ
వ్యవసాయంబ గడించి పెట్టవలె మీ వాల్లభ్యమున్, మీనమే
ష వివాదంబుల కాలమేగె సమరోత్సాహమ్మునం బేర్చి మీ
భవమున్ ధన్యము జేసి కొండు మిము నొంపన్ బుట్టి లేడవ్వడున్

పరిచయం: తుమ్మల సీతారామ మూర్తి చౌదరి రచనైన మహత్మ కథ నుంచి గ్రహించిన 'సందేశం' అనే పాఠ్య భాగం లోనిది.

సందర్భం: 1920లో గాంధీజీ భారతీయులకు సహాయ నిరాకరణ గురించి బోధించిన సందర్భం.

ప్రతిపదార్థం:

ఎవరు+ఓ – ఎవరో
మోక్షమునిచ్చువారలని – విముక్తి కల్గిస్తారని
మీకున్+ఏల – మీకు ఎందుకు
వృధాభ్రాంతి – వ్యర్థమైనభ్రమ
మీ వ్యవసాయంబ – మీకృషే
మీ వాల్లభ్యమున్ – మీకు అధికారాన్ని
గడించి పెట్టవలె – సంపాదించి పెట్టాలి
మీన మేష వివాదంబులు – సోమరితనంతో వృథాగా గడపడం
కాలమేగె – సమయము పోయింది
సమర+ఉత్సాహమున్ – యుద్ధము చేయాలనే సంకల్పంతో
పేర్చి – విజృంభించి
మీభవమున్ – మీపుట్టుకను
ధన్యము చేసికొండు – సార్థకం చేసుకోండి
మిమునొంపన్ – మిమ్ముల్ని ఓడించడానికి
ఎవ్వడున్ – ఎవడూ
పుట్టిలేడు – జన్మించ లేదు.

భావం: ఎవరోమీకు విముక్తి కల్గిస్తారనే భ్రాంతి ఎందుకు? మీ కృషే మీకు అధికారాన్ని సంపాదించి పెడుతుంది. సోమరితనంతో కాలం గడపక సమరోత్సాహంతో మీ పుట్టుకను ధన్యం చేసుకోండి. మిమ్మల్ని అణచే వారులేరు.

II **సందర్భాలు రాయండి**

1. ఈ పరతంత్ర జీవనము నెట్లు భరింతురు.

పరిచయం: పై వాక్యం తుమ్మలసీతరామమూర్తి చౌదరి 'మహత్మకథ' నుంచి గ్రహించిన సందేశం అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: 1920లో భారతీయులకు గాంధీజీ సహాయ నిరాకరణ గురించి బోధించారు. స్వాతంత్ర్యం కోసం గొప్ప కృషికి పూనుకొని ఆత్మాభిమానాన్ని పెంపొందించుకోండి. ముల్లోకాలని జయించిన వారి సంతానమైన మనం పరాయిపాలనలో జీవనం ఎలా సాగిస్తాం అనే సందర్భం లోనిది.

భావం : ఈ బానిస బ్రతుకును ఎలా భరిస్తారు అని వాక్యార్థం

2. సంగరము సేయుడు త్రోయుడు మాతృదుఃఖమున్

పరిచయం: పై వాక్యం తుమ్మలసీతరామమూర్తి చౌదరి 'మహత్మకథ' నుంచి గ్రహించిన సందేశం అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: 1920 లో గాంధీజీ సహాయ నిరాకరణని బోధిస్తూ ధర్మయుద్ధం వస్తుంది. జాతి విముక్తి కోసం సాగే యుద్ధం ఇది. బానిసత్వంతో మగ్గుతున్న భారతీయులంతా త్యాగం. శాంతి, సత్యం అనే అస్త్రాలు ధరించి ధర్మ పోరాటం చేయండి అనే సందర్భం.

భావం: ధర్మ పోరాటం చేసి భరతమాత దుఃఖాన్ని తొలగించండి.

III **1) మహత్ముడు జాతికిచ్చిన సందేశం ఏమిటి?**

భారతీయులారా! జ్ఞాన ప్రకాశాన్ని పొంది స్వాతంత్ర్యం కోసం గొప్పకృషికి పూనుకొని ఆత్మాభిమానాన్ని పెంపొందించుకోండి. ముల్లోకాలని జయించిన వారి సంతానమైన మనం పరాయి పాలనలో జీవనం ఎలా సాగిస్తాం. లేవండి. ఇది భారత జాతి విముక్తి కోసం సాగే ధర్మయుద్ధం. బానిసత్వంతో మగ్గే భారతీయులంతా త్యాగం, శాంతి, సత్యం అహింస అనే అస్త్రాలు ధరించి యుద్ధంచేసి విజయాన్ని వరించండి. భరతమాత దుఃఖాన్ని తొలగించండి.

ఎవరో విముక్తి కల్గిస్తారనే భ్రమ మీకు వద్దు. మీకృషే మీకు అధికారాన్ని సంపాదించి పెడుతుంది. వృధాగా కాలం గడపక యుద్ధోత్సాహంతో మీ జన్మను ధన్యం చేసుకొండి. మిమ్మిల్ని అణచేవారు లేరు.

ప్రపంచ చరిత్రలో ఈయుద్ధం ఎవరూ విని, చూచి ఉండరు. కుట్రలు, కుతంత్రాలు, ఈటెలు అవసరం లేదు. శత్రువులను చంపి రక్తం తాగవలసిన పనిలేదు ఇలాంటి యుద్ధం కోసం పరాక్రమించండి.

ఈ యుద్ధంలో కోపం కొంచెం చూపినా ప్రయత్నం అంతా వృధా అవుతుంది. శాంతి మార్గంలో ఈ యుద్ధాన్ని నడిపినప్పుడే దుష్టగ్రహలు తొలగి జాతికి కొత్త పండుగలు వస్తాయి.

IV **పద్యపూరణం**

1. ఈ పరతంత్ర జీవనము.....భారత ప్రజల్.
2. ఎవరో మోక్షము.....లేడెవ్వడున్.

V

1) **పాఠ్యకర్త**

కవి – తుమ్మల సీతారామ మూర్తి చౌదరి

కాలం – 1901 – 1990

బిరుదు – అభినవ తిక్కన

పాఠ్యభాగ స్వీకారం – మహత్మ కథ

ఇతర రచనలు – ఆత్మార్పణం, రాష్ట్రగానం, పజిగ పంట, నేను

2) **పర్యాయ పదాలు**

శ్రీ – సిరి, లక్ష్మి, ఐశ్వర్యం

పర్వము – పండుగ, వేడుక, పబ్బం

శత్రువు – వైరి, అరి, రిపువు

మోక్షం – ముక్తి, కైవల్యం

3) **వ్యుత్పత్యర్థాలు**

సమరము – మరణంతో కూడినది (యద్ధము)

అస్త్రము – మంత్రంచే ప్రయోగించబడేది (ఒక ఆయుధం)

4) **అర్థాలు**

భవము – పుట్టుక

అన్నువు – శోభ

సమరము – యుద్ధం

వాల్లభ్యము – అధికారం

5) **నానార్థాలు**

వ్యవసాయం – కృషి, ఉద్యోగం, సేద్యం

భవం – బ్రతుకు, పుట్టుక, ప్రపంచం

6) **సమాస పదాలు**

మాతృ దుఃఖము – మాత యొక్క దుఃఖం – షష్ఠీతత్పురుష సమాసం

సమరోత్సాహము – సమరము నందు ఉత్సాహం – సప్తమీ తత్పురుష సమాసం

పరతంత్ర జీవనము – పరతంత్రమైన జీవనం – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

7) **సంధి కార్యములు**

సమరోత్సాహం – సమర + ఉత్సాహము – గుణసంధి

అత్యుగ్ర – అతి + ఉగ్ర – యణాదేశసంధి.

విశ్వమెల్ల – విశ్వము + ఎల్ల – ఉకారసంధి

లెండిక – లెండు + ఇక – ఉకారసంధి

మీకేలా – మీకున్ + ఏలా – ఉకార వికల్ప సంధి

రణంబిది – రణంబు + ఇది – ఉకారసంధి

ప్రకృతి – వికృతి

యత్నం – జతనము

పర్వం – పబ్బము

రిక్త – రిత్త

శ్రీ – సిరి

నిత్యం – నిచ్చలు

వృధా – విత

ధర్మం – దమ్మము

ముక్తి – ముత్తి

VI **నేపథ్యం:** 1920 లో గాంధీజీ సహాయనిరాకరణోద్యమం చేపట్టాడు. మహత్ముడు సహాయ నిరాకరణ పద్ధతిని భారతీయులకు భోదించిన సందర్భం ఇది.

ఓరుగల్లు

I సందర్భాలు

1. కాలమ్ములో వింత కనకాభిషేకమ్ము

పరిచయం:

పై వాక్యం పుట్టపర్తి నారాయణాచార్యులు రచనైన 'మేఘదూతం' నుంచి గ్రహించిన 'ఓరుగల్లు' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భము:

రుద్రమ దేవిని అబలగా భావించి ఆమెను జయించడం చాలా సులభమని దేవగిరిరాజు ఓరుగల్లు పైకి దండెత్తి వచ్చాడు. యుద్ధరంగ ంలో రుద్రమ అపరకాళిలా విజృంభించి ఎక్కడ చూసినా తానై చెలరేగింది. మహదేవ రాజుని దేవగిరి వరకు తరిమింది. మహదేవరాజు ఓటమిని అంగీకరించి రుద్రమ దేవిని శరణు వేడు కొన్న సందర్భం.

భావం :

రుద్రమదేవి ధాటికి తట్టుకోలేక మహదేవ రాజు యుద్దరంగం నుంచి పారిపోతే దేవగిరి వరకూ అతన్ని తరిమింది. దేవగిరి రాజు తన ఓటమిని అంగీకరించి తన తలను రుద్రమ పాదాలకు తాకించి కోటి ధనరాశులను కుప్పగా పోసాడు. ఇది ఏనాటికైనా వింత కనకాభిషేకమే.

2) కరసాన బట్టినది ఖడ్గలతికకు గూడ.

పరిచయం:

పై వాక్యం పుట్టపర్తి నారాయణాచార్యులు రచనైన 'మేఘదూతం' నుంచి గ్రహించిన 'ఓరుగల్లు'అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం:

దేవగిరి రాజు మహదేవుడు రుద్రమ దేవి అబల అని. ఆమెను జయించడం చాలా తేలిక అని భావించి. పురుషాహంకారంతో ఓరుగల్లుపై దండెత్తి వచ్చాడు. ఆమె పరాక్రమం ముందు తలవంచక తప్పలేదు. చేజిక్కిన యాదవరాజుకు రుద్రమ క్షమాబిక్ష పెట్టిన సందర్భము లోనిది.

భావం:

తెలుగింటి ఆడపడచులు లతల్లా సుకుమారులు. అవసరమైతే చూపులు పదునుతో బాటు, వాడి కత్తులకు కూడా పదునుబెట్టి శత్రువును తెగ నరక గల తెగువను ప్రదర్శించగలరు.

II **ఓరుగల్లు పాఠ్యాంశ సారాంశం తెల్పండి?**

ఈ పాఠ్యభాగం పుట్టపర్తి నారాయణాచార్యుల వారి మేఘదూతం లోనిది. కన్నడ దేశంలో కారాగారంలో ఉన్న యువకుడు మేఘునితో పల్కిన ఓరుగల్లు వైభవం.

ఓ మేఘమా! ప్రయాణం దూరమని ఓరుగల్లు వెళ్లడం మరచిపోతావేమో! ఓరుగల్లు ఆంధ్రచరిత్ర అనే కన్యకకు పుట్టినిల్లు. అక్కడే రుద్రమదేవి శత్రువుల రక్తాన్ని సెలయేఱులా ప్రవహింపజేసింది.

యాదవ రాజైన మహదేవరాజు రుద్రమ స్త్రీ అనే చులకన భావంతో త ఆమెపై దండెతివచ్చాడు. రుద్రమ అపరకాళిలా విజృంభించి అన్నిచోట్ల తానై మహదేవ రాజును దేవగిరి వరకు తరిమింది.

ఓడిపోయిన మహదేవరాజు కోట్లాది ధనరాసులు ఆమెకు సమర్పించాడు. అతన్ని క్షమించి వదిలి ఆంధ్ర స్త్రీ పరాక్రమాన్ని కావ్యంగా రాయించుకొని పాడుకో అని చెప్పిందట. తన విజయాలకు ప్రతీకగా ఎన్నో జయస్తంభాలు నాటించింది. ఈమె పరాక్రమాన్ని ఏ సోమశేఖర కవో చెప్పాలి.

ఓరుగల్లులో విద్యానాథుడు అనే అమరకవి చీకిపోయిన గుండెలతో. నిండిన కన్నీళ్లతో కనిపిస్తాడు. ఆయన పాద పద్మాలకు పాద్యం సమర్పించు, తన కావ్య నాయకుడు ప్రతాప రుద్రుడు బందీకాగా దుఃఖభారంతో ప్రాణాలు విడిచాడు. ఆ ఇంటివద్ద వర్షం కురిపించు. నీది చావులేని పుట్టుక.

III

1) పాఠ్యకర్త

కవి – పుట్టపర్తి నారాయణాచార్యులు

కాలం – 1914 – 1990

బిరుదు – సరస్వతీ పుత్రుడు

పాఠ్యభాగ స్వీకారం – మేఘదూతం

ఇతర రచనలు – పండరి భాగవతం, జనప్రియ రామాయణం

2) నేపథ్యం

అధికారుల అన్యాయాన్ని ఎదరించి ఒక యువకుడు జైలు పాలయ్యాడు. ఆ జైలులో నరకం లాంటి జీవితాన్ని గడుపుతూ తన భార్యను గురించి చింతిస్తున్నాడు. ఖైదీకి కిటికీలో నుంచి మేఘుడు కనిపించాడు. తన సందేశాన్ని శ్రీకాకుళంలో ఉన్న తన భార్యకు అందించాల్సిందిగా ప్రార్థించాడు. కన్నడదేశంలో బయలుదేరి ఆంధ్రదేశంలోని పవిత్ర క్షేత్రాలు, దర్శిస్తూ వెళ్లమని ఖైదీ మేఘుని ప్రార్థించడమే ఈ పాఠ్యభాగ నేపథ్యం

3) పాత్రస్వభావం

రుద్రమదేవి

కాకతీయ చక్రవర్తియైన గణపతిదేవ మహరాజు కుమార్తె. ఆంధ్ర దేశాన్ని పాలించిన గొప్ప పాలకుల్లో ఒకరు. పరాక్రమ వంతురాలు. వీర వనిత. దయాగుణం కలది. కరుణామూర్తి. ఆంధ్రస్త్రీ పరాక్రమాన్ని చాటిచెప్పిన ధీరురాలు.

4) **గేయకవిత - ప్రక్రియ**

గేయకవిత పాడుకోడానికి ఉపయోగపడేది. నీతిని, దేశభక్తిని బోధించేదిగా వుంటుంది. ఇందు గణాలు ఉంటాయి. ద్విపద ఛందస్సులో, మాత్రా ఛందస్సులో వ్రాయవచ్చు

5) **పర్యాయ పదాలు**

మగువ - నారి, ఇంతి, స్త్రీ

అడిదము - అసి, కత్తి, ఖడ్గము

కదనం - రణం, పోరు, సమరం

శంభుడు - శివుడు, రుద్రుడు, శంకరుడు

6) **అర్థాలు**

మగువ - స్త్రీ

అడిదము - కత్తి

కలిమి - మిక్కిలి

ఉవిద - స్త్రీ

రుద్రాణి - పార్వతి

7) **నానార్థాలు**

జీవితము - బ్రతుకు, ఆయువు

కలిమి - బలం,పట్టుదల, గొప్పతనం

8) **వ్యుత్పత్యర్థాలు**

అమరులు - మరణం లేనివారు (దేవతలు)

రుద్రాణి - రుద్రుని భార్య (పార్వతి)

శంకరుడు - సుఖములను కలుగజేసే వాడు (శివుడు)

9) **సమాసములు**

కనకాభిషేకము - కనకంతో అభిషేకం - తృతియాతత్పురుష

దయావర్షం - దయ అనే వర్షం - రూపక సమాసము

ఆపాదనఖము - పాదాల నుంచి నఖం వరకూ - అవ్యయీ భావ సమాసము

ఖడ్గలతిక - లతిక వంటి ఖడ్గం - ఉపమానోత్తర పదకర్మధారయ సమాసం

మహత్ముడు - గొప్ప ఆత్మకలవాడు - బహువ్రీహి సమాసం

10) **సంధి కార్యములు**

1. చండీశ్వరి - చండి + ఈశ్వరి - సవర్ణదీర్ఘసంధి.

2.కనకాభిషేకము - కనక + అభిషేకము - సవర్ణదీర్ఘ సంధి.

3.పేరాస - పేరు + ఆస - ఉకారసంధి.

4.రూపెత్తి – రూపు + ఎత్తి – ఉకారసంధి.

5.పుట్టినిల్లు – పుట్టిన + ఇల్లు – అకారసంధి.

11) ప్రకృతి – వికృతి

కావ్యము – కబ్బము

ఖడ్గము – కగ్గము

కన్య – కన్నె

రూపము – రూవు

ఆశ – ఆస

12) రుద్రమ్మ చండీశ్వరీ దేవి జలజలా పారించె శత్రువుల రక్తమ్ము చెడని సెలయేఱుగా – ఇందులో అలంకారం

రూపకాలంకారం

ఉపమేయం – రుద్రమ్మ

ఉపమానం – చండీశ్వరీ దేవి కీ అభేదం చెప్పడం జరిగింది కాబట్టి రూపకం

7. గీతాంజలి

I సందర్భాలు రాయండి

1. వాళ్ళకి వలలు వెయ్యడం చేతకాదు.

పరిచయం:

పై వాక్యం రవీంద్రుని గీతాంజలి నుంచి చలం అనువదించిన గీతాంజలి అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం:

పిల్లలు అంతులేని సముద్ర తీరంలో కలుసుకొన్నారు. కేరింతలతో నాట్యాలు చేస్తున్నారు. ఇసుకతో ఇళ్లు కట్టుకోవడం, ఉత్త ఆల్చిప్పలతో ఆడుకోవడం, ఎండుటాకులతో పడవలు చేసి విశాల సముద్రంపై చిరునవ్వుతో వదలడం వారికి సరదా, అని కవి వర్ణించే సందర్భం

భావం:

పిల్లలకు వలలు ఉపయోగించడం, ఎవరినీ వశపరచుకోవటం చేత కాదని భావం.

2. వర్తకులు ఓడల్లో ప్రయాణమౌతారు.

పరిచయం:

పై వాక్యం రవీంద్రుని గీతాంజలి నుంచి చలం అనువదించిన గీతాంజలి అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం:

వ్యాపారం చేసేందుకు వర్తకులు ఓడల్లో ప్రయాణమవుతారు. అయితే పసిపిల్లలు మాత్రం సముద్ర తీరంలో ఇసుకతో గూళ్ళు కట్టుకుంటూ, ఎండుటాకులతో పడవలు చేసి సముద్రంలో వదులుతూ ఆనందిస్తారు. చిరునవ్వులు చిందిస్తూ ఆడుకోవడం తప్ప వారికి మరోటి తెలియదు. పై వాక్యం ఈ సన్నివేశాన్ని తెలియజేసే సందర్భం.

భావం:

వర్తకం చేసేవారు ఓడలో సముద్రం మీద ప్రయాణం చేస్తారని భావం

II **గీతాంజలి ద్వారా కవి అందించిన సందేశం ?**

రవీంద్రుడు ప్రకృతిని ఆరాధించే కవి. ప్రకృతిలో సహజత్వాన్ని, దైవత్వాన్ని పిల్లల్లో చూసి 'గీతాంజలి' కవిత ద్వారా మనముందుంచాడు.

పిల్లలు అమాయకులు. కల్మషం, స్వార్థంలేని దైవసమానులు. ప్రకృతి విలయతాండవం చేస్తున్నా పిల్లలు నిర్మలంగా ఉంటూ గంతులేస్తారు. నృత్యం చేస్తూ, ఆనందంగా వుంటారు. ఇసుకతో ఇళ్లు కట్టుకొంటారు. ఆల్చిప్పలతో ఆడుకొంటారు. స్వార్థం, హింస, మోసం ఎరుగని అమాయకులు

పిల్లలకు ఈదడం, వలలు వెయ్యడం చాతకాదు. సముద్రంలో దాగిన గుప్త ధనరాశుల కోసం వెతకరు. ముత్యాలపై ఆశలేదు. సముద్రంలో పొంగే అలలు మృత్యువులా భయంకరంగా ఉంటాయి. తోవ తెలియని ఆకాశంలో తుఫాను విజృంభిస్తోంది. ఓడలు పగిలిపోతున్నాయి. కాని పిల్లలు సముద్ర తీరంలో సమావేశమయ్యారు.

సందేశం

1. స్వార్థం వద్దు, ఆనందం ముద్దు.
2. పిల్లల హృదయాలల్లా పెద్దల హృదయాలు కల్మషం లేకుండా వుండాలి.
3. ఆటుపోట్లు జీవితంలో సర్వసాధారణం సముద్రంలో లా.
4. తుఫానులా సమస్యలు ఎదురైనా ప్రశాంతత తరువాత ఉంటుంది.
5. సహనం, ధైర్యం పెంపొందించుకోవాలి.

III **గీతాంజలి నేపథ్యం:**

పసిపిల్లలు అమాయకులు. ప్రకృతిమాత ఒడిలో హాయిగా వుంటారు. కల్లాకపటం తెలియని వారికి ఆనందమే పరమావధి. స్వార్థం తెలియని వారు ప్రకృతిని ఎలా ఆస్వాదించాలో గ్రహించాలని, వినాశనానికి మూలం కాకూడదని తెలియ చెప్పేదే ఈ పాఠ్యభాగ నేపథ్యం.

IV **1) పర్యాయ పదాలు**

తీరము – దరి,ఒడ్డు, తట్టు

వర్తకుడు – వ్యాపారి, బేహారి

అల – తరంగం, వీచి, లహరి

2) అర్థాలు

అవిరామం – విరామం లేకుండా.

తీరం – గట్టు, దరి

3) నానార్థములు

లోకము – జగత్తు, చూపు, గుంపు

అర్థము – ప్రయోజనము, శబ్దార్థము.

4) సమాస పదాలు

1. అవిరామం – విరామం లేనిది – నఞ్ తత్పురుష సమాసం
2. గీతాంజలి – గీతాల అంజలి – షష్ఠి తత్పురుష సమాసము
3. అనంతాకాశం – అనంతమైన ఆకాశం – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
4. చిరునవ్వు – చిన్నదైన నవ్వు – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

5) **సంధికార్యాలు**

గీతాంజలి – గీత + అంజలి – సవర్ణదీర్ఘ సంధి.

అనంతాకాశం – అనంత + ఆకాశం – సవర్ణదీర్ఘ సంధి.

నృత్యాలు – నృత్యము + లు – లు,ల,న,ల సంధి.

తీరాన – తీరము + న – లు,ల,న,ల సంధి.

ఎండుటాకులు – ఎండు + ఆకులు – టుగాగమ సంధి.

6) **ప్రకృతి – వికృతి**

మృగం – మెకం

భగ్నము – బన్నము

మృత్యువు – మిత్తి

తీరం – దరి.

7) **మృత్యు భయంకరమైన అలలు,**

శిశువుకి ఉయ్యాలలూపే తల్లివలె,

అర్థంలేని జోలపాటల్ని పాడుతున్నాయి. ఇందులో ఉన్న అలంకారం

ఉపమాలంకారం

మృత్యుభయంకరమైన అలలు	–	ఉపమేయం
ఉయ్యాలలూపే తల్లి	–	ఉపమానం
జోల పాటల్ని పాడడం	–	సమానధర్మం
వలె	–	ఉపమ వాచకం

తామసి

I ప్రతిపదార్థం

ఆకాశమ్మది చీకటిల్లు: శశితారార్కావళుల్ మిణ్గురుల్:
లోకం బియ్యది చీకటింటి పరదాలో డాగు మృత్పిండ: మిం
దా కల్పింపగ జూచెదేల? పరిహసార్థమ్మొ దీపావళి
ప్రాకారమ్ములు? తామసీ ధరణి కంపంబల్లదే వచ్చెడిన్.

పరిచయం:

ధాశరధి రచించిన అమృతాభిషేకం లోనిది.

సందర్భం:

కవి చీకట్లను వర్ణించిన సందర్భం

ప్రతిపదార్థం:

ఆకాశమ్మది – ఆ ఆకాశము
చీకటి + ఇల్లు – చీకటికి ఇల్లువంటిది
శశి – చంద్రుడు
తార – నక్షత్రం
అర్క – సూర్యుడు
ఆవళుల్ – వరుసలు
మిణ్గురుల్ – మిణుగురు పురుగుల వంటివి
లోకంబు + ఇయ్యది – ఈ లోకం
చీకటి + ఇంటి – చీకటింటి
పరదాలో – తెరలో
డాగు – దాగు
మృత్పిండం – మట్టిముద్ద
ఇందున్ – ఈ లోకంలో
దీప + ఆవళి – దీపాల వరసలు
ప్రాకారమ్ములు – ప్రాకారాలు
ఆకల్పింపగన్ – ఏర్పరిచేందుకు
చూచెదేల – చూస్తావెందుకు
పరిహాసర్థమ్ము – పరిహసం కొరకా

అల్లరే – అదిగో

తామసీ – చీకటి

ధరణి కంపంబు – భూకంపం

వచ్చెడిన్ – వస్తోంది.

భావం:

ఆకాశం చీకటిల్లు చంద్రుడు, నక్షత్రాలు, సూర్యుడు మిణుగురు పురుగులు లోకం చీకటింటి తెరలో దాగిన మట్టిముద్ద. దీపాల వరుసలు పెట్టాలనుకుంటావెందుకు పరిహసం కోసమా! భూమి వణికేట్లుగా రాత్రి వస్తోంది.

2) **ఇరులు నిశాసతీ భుజము లెక్కి. శిరమ్మున నిక్కి, తారకా**
తరుణి కపోల పాళికలు తాకి, విహయస వీధి వ్రాకి, చం
దురు పయి సోకి, భూమి ధర దుర్గమ వీధుల దూకి, మెల్లగా
ధరపయి కాలు మోపిన వుదారములై హరినీల కాంతులన్.

పరిచయం:

దాశరధి రచించిన 'అమృతాభిషేకం' లోనిది.

సందర్భం:

కవి చీకట్లను వర్ణించే సందర్భం

ప్రతిపదార్థం:

ఇరులు – చీకట్లు

నిశాసతీ – రాత్రి అనే స్త్రీ

భుజములు – భుజాలు

ఎక్కి – ఎక్కి

శిరమ్మున నికి – శిరస్సుపై నిలబడి

తారకా తరుణి – నక్షత్రాలనే స్త్రీల

కపోల పాళికలు – చెక్కిళ్లు

తాకి – స్పృశించి

విహయాస వీధి – ఆకాశమార్గంలో

వ్రాకి – వ్యాపించి

చందుర పయి సోకి – చంద్రునిని తాకి

భూమి ధర – పర్వతం పై

దుర్గమ – నడవడానికి వీలుకాని

వీధుల దూకి – దారుల్లోకి దూకి

మెల్లగా – నిదానంగా

ధరపయి – భూమిపై

హరినీల కాంతులన్ –ఇంద్రనీలమణి కాంతులతో

ఉదారములై – గొప్పవై

కాలుమోపినవి – కాలు పెట్టాయి.

భావం:

నల్లని కాంతులతో నిశ అనే స్త్రీ భుజాలు ఎక్కి, శిరస్సుపై నిలబడి, నక్షత్రాలనే స్త్రీ చెక్కిళ్లు స్పృశించి, ఆకాశంలో పాకి, చంద్రుని తాకి, నడవడానికి వీలులేని పర్వత దారుల్లోకి దూకి నిదానంగా చీకట్లు భూమిపై అడుగుపెట్టాయి

II సందర్భాలు

1. మట్టి దివ్వె నిలుచు మాటకల్ల.

పరిచయం:

పై వాక్యం దాశరధి రచనైన ''అమృతాభిషేకం'' నుంచి గ్రహించిన **'తామసి'** అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం:

దాశరధి చీకటిని వర్ణిస్తూ, వెచ్చదనం లేని దీపాలవల్ల ప్రయోజనం ఉండదనీ, చీకట్లు వర్షధారల్లా వస్తున్నాయనీ, అలాంటి చీకట్లలో మట్టి దీపం నిలబడదనీ చెప్పిన సందర్భం

భావం:

మట్టి దీపం అంటే ప్రమిదలో పెట్టిన దీపం. అది చీకటిలో వెలగదు ఆరిపోతుంది అని భావం

2. ఇరులె నరులకు మరులు కల్పించు గాత

పరిచయం:

పై వాక్యం దాశరధి రచనైన ''అమృతాభిషేకం'' నుంచి గ్రహించిన **'తామసి'** అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం:

చీకట్లు స్త్రీ అందమైన నల్లని కొప్పులాగా, నల్లకలువల్లాగా, నీలి మేఘాల్లాగా, అందమైన స్త్రీల కనుపాపల్లాగా వలపు కురిపించాలి. అందమైన చీకట్లు అందరికీ ఆనందాన్ని కలిగించాలని కవి వర్ణించే సందర్భం

భావం:

చీకట్లు కురులై, ఝరులై పరుగెత్తాలి. కరులయి, హరులయి మనసుకు హాయి నివ్వాలి. చీకట్లే పూలై, పూదండలై భూమిని నింపాలి. చీకట్లు మానవులకు మోహాన్ని కలిగించాలి.

III **కవి చీకట్లను ఏవిధంగా వర్ణించాడు**

దాశరథీ కవి చీకట్లను ఇలా వర్ణించాడు. స్త్రీ ముఖంమీద కస్తూరి బొట్టుతోనూ, నల్లని వంకుల ముంగురులు కలిగిన స్త్రీ కనుబొమ్మలతోనూ, నీలమేఘాలతోనూ, యువతి కంటిపాపతోనూ, కలువ కంటి కనురెప్పలతో స్త్రీ చెక్కిలిపై అగరు చుక్కతో కవి చీకట్లను పోల్చాడు. వెండికొండ మీద మబ్బులతోనూ, చంద్రుడనే పొలంలో తిరిగే జింకతోనూ, ఆదిశేషునిపై పరుండిన విష్ణువు తోనూ చీకట్లను కవి పోల్చాడు. ఇవన్నీ చీకటి లా నలుపురంగు కలవే. చీకట్లను కోకిలలతోనూ, తుమ్మెదలతోనూ, నెమళ్ళతోనూ, నల్లకలువలతోను కవి పోల్చాడు.

చీకట్లని కురులుగా, కరులుగా, హరులుగా పోల్చి చెప్పాడు. ఆకాశాన్ని చీకటిల్లుగా చంద్రుడు, నక్షత్రాలు, సూర్యుడు మిణుగురు పురుగులుగా ఈ లోకం చీకటింటి పరదాలో దాక్కొన్న మట్టి ముద్దగా వర్ణించాడు.చీకట్లు నీలమణి కాంతులతో లోకానికి అందాన్ని చేకూరుస్తాయని కవి వర్ణించాడు.

IV **పద్యభావములు**

1. **వెచ్చదనము లేని వెర్రిదీపమ్ముల**
   పెట్టదలచె దేల పిచ్చిదాన?
   వర్షధార వొలె వచ్చు చీకట్లలో
   మట్టిదివ్వె నిలుచుమాట కల్ల.

భావం:

ఓ వెర్రిదానా! వెచ్చదనం లేని దీపాలను పెట్టాలనుకొంటావెందుకు? వర్షధారల్లాగా వచ్చే చీకట్లలో మట్టి దీపం నిలబడుతుందా? నిలబడదు అని భావం.

2. **గొళి నాల్క మీది కంటకమ్ములలోన**
   చిక్కుకొన్న యట్టి చిన్నపురుగు
   అంధకారమందు ఆటాడు దీపంబు
   మరు నిమిసమునందు మడియ గలదు.

భావం:

చీకటిలో అల్లల్లాడే దీపం బల్లి నాలుక మీది ముళ్లలో చిక్కుకున్న పురుగు లాంటిది. నిమిషంలో నశిస్తుంది.

V **పద్యపూరణ**

1. ఇరులు నిశాసతీ.....హరినీలకాంతులన్
2. ఆకాశమ్మది చీకటిల్లు.....వచ్చెడిన్.

VI

1) **పాఠ్యకర్త**

కవి – దాశరధి కృష్ణమాచార్యులు

కాలం – 1927-1987

బిరుదు – కళాప్రపూర్ణ

పాఠ్యభాగ స్వీకారం

అమృతాభిషేకం

ఇతర రచనలు

అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం.

2) **నేపధ్యం**

తెలుపు శుభానికి, నలుపు అశుభానికీ ప్రతీకలు. ప్రకృతిలో ప్రతి వస్తువు అందమైనదే. దేన్నీ నిరాదరణతో చూడకూడదని చీకటిని ఆస్వాదించాలని వర్ణించడం.

3) **పర్యాయపదాలు**

ఇరులు – చీకట్లు, అంధకారము, ఆంధ్యము

ఇందీకరము – కలువ, ఉత్పలం

భూమి ధరం – పర్వతం, శైలం, అద్రి.

తరుణి – స్త్రీ, వనిత, పడతి.

4) **అర్థాలు**

నిశ – రాత్రి

భూమిధరం – పర్వతము

ఆంధ్యము – చీకటి

ఇరులు – చీకట్లు

కేదారము – పొలం

కరులు – ఏనుగులు

విహయాసము – ఆకాశం

కాసారం – కొలను

వ్యుత్పత్యర్థాలు

విహయసం – దీనిలో అన్నీ విశేషంగా సంచరిస్తాయి. (ఆకాశం)

కేదారం – నీళ్ళు కట్టి దున్నే నది (పొలం)

ధరణి – విశ్వాన్ని ధరించేది (భూమి)

సౌధం – సున్నముతో కట్టినది (భవనం)

భూమిధరం – భూమిని ధరించేది (పర్వతం)

తామసి – అధికమైన తమస్సు కలది (చీకటి)

నానార్థాలు

అంబకం – బాణము, కన్ను

కంటకం – ముల్లు,కాకి, సూదిమొన

మృగం – జింక, జంతువు

ధర – భూమి,వెల

సతి – స్త్రీ, భార్య, పతివ్రత

హరి – విష్ణువు, గుర్రము, కోతి

తామసి – రాత్రి, పార్వతి, చీకటి

సమాస పదాలు

దీపావళి – దీపాల యొక్క ఆవళి – షష్ఠీ తత్పురుష సమాసం

వర్షధార – వర్షము యొక్క ధార – షష్ఠీ తత్పురుష సమాసం

నిశాసతి – నిశ అనెడిసతి – రూపక సమాసం

నల్లకల్వలు – నల్ల నైన కలువలు – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

వెండికొండ – వెండిదైన కొండ – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

కానుగ చెట్టు – కానుగ అనే పేరు గల చెట్టు – సంభావన పూర్వపద కర్మధారయ సమాసం

సంధులు

నవాషాడము – నవ + ఆషాఢం – సవర్ణదీర్ఘ సంధి

దీపావళి – దీప + ఆవళి – సవర్ణదీర్ఘ సంధి

ఆటాడు – ఆట + ఆడు – అత్వసంధి

చీకటిల్లు – చీకటి + ఇల్లు – ఇత్వసంధి

భుజములెక్కి – భుజము + ఎక్కి – ఉత్వసంధి

VI ప్రకృతి – వికృతి

విష్ణువు – వెన్నుడు

దీపము – దివ్వె

నిశ – నిసి

శయ్య – సెజ్జ

మృగము – మెకం

చంద్రుడు – చందురుడు

తీరము – దరి

VII అలంకారాన్ని గుర్తించుట

1. నల్ల కల్వల వోలె ఉల్ల సిల్లెడు నిరుల్ కాసారములలోన గ్రాలు గాత

చీకట్లు – ఉపమేయం

కలువలు – ఉపమానం

పోలె – ఉపమావాచకం

కాబట్టి ఇది ఉపమాలంకారం

2. **వర్షధార వోలె వచ్చు చీకట్లలో మట్టి దివ్వె నిలుచు మాట కెల్ల**

చీకట్లు – ఉపమేయం

వర్షధార – ఉపమానం

పోలె – ఉపమావాచకం

కాబట్టి ఇది ఉపమాలంకారం

స్ట్రీట్ చిల్డ్రన్

I సందర్భం

1. వాళ్ళను చూస్తుంటే పురాతత్వ శాస్త్రవేత్తలు గుర్తుకు వస్తారు.

పరిచయం:

పై వాక్యం మహెజబీన్ రచనైన **'ఆకురాలు కాలం'** నుంచి గ్రహించబడిన **'స్ట్రీట్ చిల్డ్రన్'** అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం:

బతకడానికి ఎన్ని పాట్లో. వీధి బాలలు తాము బతకడం కోసం ఎన్నో వీధి పోరాటాలు చేస్తారు. ఆ పోరాటాల్లో గాయాలవుతాయి. చెత్తకుప్పల్లో దొరికే చిత్తు కాగితాలను అపురూపంగా వారు దాచు కొంటారని రచయిత్రి చెప్పే సందర్భం.

భావం:

పురాతత్వ శాస్త్రజ్ఞులు తమకు లభించిన చారిత్రక ఆధారాలను ఎంత అపురూపంగా దాచుకుంటారో, అనాధలైన వీధి బాలలు చెత్తకుప్పల్లో దొరికే చెత్త కాగితాల్ని అంతే భద్రంగా దాచిపెట్టుకుంటారు. ఆ బాలల్ని చూస్తే పురాతత్వ వేత్తలు గుర్తుకు వస్తారు అని భావం.

II **స్ట్రీట్ చిల్డ్రన్ సారాంశం?**

స్ట్రీట్ చిల్డ్రన్ అనే పాఠ్యభాగం మహెజబీన్ రచించిన 'ఆకురాలు కాలం' లోనిది. స్ట్రీట్ చిల్డ్రన్ అంటే వీధి బాలలు. వీరి బాల్యం శాప గ్రస్తమైంది. ఎన్నో సంచలనాలు వారి జీవితాన్ని కుదిపేశాయి. సూర్యోదయానికి సలాం కొట్టి బ్రతుకు భారాన్ని మోస్తూ సంచీ భుజాన వేసుకొని వారు బయల్దేరతారు.

అక్షరాలు దిద్దాల్సిన బాల్యం చిత్తు కాగితాలు ఏరడంలో చిక్కుకు పోతుంది. పాలు తాగాల్సిన బాల్యం పాల కవర్ల వేటలో చేజారి పోతుంది.

ఏ అమావాస్య వారిని వీధి పాలు చేసిందో గాని ఎండా, వానా ఋతువు, పగలు, రాత్రీ అనే తేడాలు లేకుండా చిత్తుకాగితాలు ఏరుతూ వుంటారు.

ఆడుతూ పాడుతూ ఆనందంగా గడపాల్సిన ఆ అభాగ్యుల జీవితం ఆటుపోట్లకు ఆలవాల మయింది. బ్రతకడానికి వాళ్లు ఎన్నో పోరాటాలు చేస్తూవుంటారు. చెత్తకుప్పల్లో దొరికే వస్తువుల్ని అపురూపంగా సంచిలో వేసుకునే వాళ్ళను చూస్తే పురాతత్వ శాస్త్రవేత్తలు గుర్తుకువస్తారు. ఆత్మస్థైర్యంతో గంభీరంగా నడిచిపోయే వారిని చూస్తే ఆశ్చర్యం కల్గుతుంది.

III

1) **పాఠ్యకర్త**

రచయిత్రి – మహెజబీన్

కాలం – 1961

పాఠ్యభాగ స్వీకారం – ఆకురాలు కాలం

విశేషాలు – తెలుగు స్త్రీవాద కవయిత్రుల్లో చెప్పుకోదగ్గ రచయిత్రి

2) **నేపథ్యం**

సమకాలీన సమస్యలలో ప్రధాన సమస్యయైన వీధిబాలల దీనావస్థను గురించి తెలియజెప్పడమే ఈ పాఠ్యభాగ నేపథ్యం.

3) **పర్యాయ పదాలు**

పాలు – క్షీరం,దుగ్ధం

కుప్ప – రాశి, గుట్ట, పోగు

4) **అర్థాలు**

ఆత్మస్థైర్యం – మనోనిశ్చయం

సలాంకొట్టు – వీడ్కోలు చెప్పు.

5) **సమాసాలు**

అనేకం – ఏకం కానిది – నఞ్ తత్పురుష సమాసం

పాలకవర్లు – పాల కొరకు కవర్లు – చతుర్థీ తత్పురుష సమాసం

6) **సంధులు**

అనేకానేక – అనేక + అనేక – సవర్ణదీర్ఘ సంధి

సూర్యోదయము – సూర్య + ఉదయము – గుణసంధి

యుద్ధాలు – యుద్ధము + లు – లు,ల,నల సంధి

7) **ప్రకృతి – వికృతి**

రాత్రి – రాతిరి

వీధి – వీది

అక్షరము – అక్కరము

శాస్త్రము – చట్టము

అమావాస్య – అమాస